క్లుప్తంగా

ఘనంగా ఫేర్‌వెల్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ బలగల శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఆదివారం ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువుతో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి, ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదివాసీ సంఘాల నాయకుల అరెస్టు సరికాదు'

పెంచికల్‌పేట్: అటవీసంరక్షణ నియమాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ పట్టణంలో తలపెట్టిన సభను అడ్డుకుని నాయకులను అరెస్టు చేయడం సరికాదని గోండ్వానా ఆదివాసీ కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్ అన్నారు. ప్రభుత్వం ఆదివాసీలపై కపట ప్రేమ చూపిస్తుందన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



భూసారాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

కౌటాల: విద్యార్థులు భూసారంపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం మార్త రమేష్ అన్నారు. రాష్ట్రీయ ఆవిష్కర్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 6వ, 7వ తరగతి విద్యార్థులు నేల ఆరోగ్యంపై అధ్యయనం చేశారు. విద్యార్థులు నేలలోని మట్టిని తవ్వి పరిశీలించారు. ఉపాధ్యాయులు సంతోషిరేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీఓఈ సెట్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల ల్లో ఆదివారం నిర్వహించిన గురుకుల సీఓఈ సెట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు పరీక్ష కేంద్రాల్లో 680 మంది విద్యార్థులకు గాను 619 మంది పరీక్షకు హాజరయ్యారు. 61 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన జీవస్వరం కూటములు



బోధిస్తున్న బిషప్ అంతోని

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జీవస్వరం సువార్త స్వస్థత కూటములు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని మాట్లాడుతూ ప్రజలందరు యేసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలన్నారు. జీవ స్వరం కూటములతో ఇన్‌ఫంట్ పాఠశాల ఆవరణలో భక్తుల సందడి నెలకొంది. కూటముల్లో ఫాదర్లు సీజో, టోమ్, బైజూ, సతీష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ మహాసభలకు తరలిన గౌడ కులస్తులు



మహాసభలకు తరలివెళ్తున్న నాయకులు

రెబ్బెన: కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మోకుదెబ్బ జిల్లా రెండో మహాసభలకు ఆదివారం రెబ్బెన, తిర్యాణి మండలాలకు చెందిన గౌడ కులస్తులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోడెం చిరంజీవిగౌడ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండ సంతోష్‌గౌడ్‌తో పాటు పలువురు తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని గీతా కార్మికుల హక్కుల కోసం మోకుదెబ్బ అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటుతో తప్పని ఇక్కట్లు



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

- గేటు పడితే తప్పని నిరీక్షణ
- నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో పెద్దబండ –వేంపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటుతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి రైల్వేగేటు పడగానే వాహనదారులు, ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉంటే ఈ ప్రధాన రహదారిలో సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర ప్రయాణికులు సైతం ప్రయాణం చేస్తుంటారు. రైల్వేగేటు పడితే ప్రతీరోజు వందల సంఖ్యలో వాహనదారులు 20 నిమిషాల నుంచి సుమారు గంట వరకు వేచి ఉండాల్సి వస్తుంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం సకాలంలో రోగులను ఆసుపత్రులకు తరలించలేక పోతున్నాయి. గతంలో పలు సందర్భాల్లో రైల్వేగేటు పడడంతో అంబులెన్స్‌ల్లోని రోగులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. గతంలోనే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు కాగా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.



నత్తనడకన సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

ప్రమాదకర ప్రయాణాలు

పెద్దబండ –వేంపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రైల్వే గేటు పడి గంటల తరబడి నిరీక్షించలేక ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. గేటుపడి ఉన్న సమయంలో ద్విచక్రవాహనదారులు వేచి ఉండకుండా గేటు కింద నుంచి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. రైల్వే అధికారులు రైల్వే గేటు కింద నుంచి ప్రయాణాలు చేయవద్దని చెబుతున్నా గంటల తరబడి నిరీక్షించే ఓపిక లేక వాహనదారులు ప్రమాదకరంగా గేటు దాటుతున్నారు. అంతేగాక రైల్వేగేటు వద్ద అప్పుడప్పుడు సాంకేతిక లోపం సంభవిస్తుండగా రైల్వే అధికారులు వచ్చి మరమ్మతులు చేపట్టే వరకు ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. రైల్వేగేటు పడడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతీరోజు తప్పని నిరీక్షణ



పెద్దబండ –వేంపల్లి రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు రైల్వే గేటు పడితే ప్రతీరోజు సుమారు గంట వరకు నిరీక్షించాల్సిందే. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు సైతం నిలిచిపోతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలి.

– దుర్గం రాజ్‌కుమార్, సిర్పూర్(టి)

అధికారులు చొరవ చూపాలి



రైల్వేగేటు వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ చూపించి మంజూరైన వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– మహేష్, సిర్పూర్(టి)

పాఠశాలలో పొంచిఉన్న ప్రమాదం



వాంకిడి: మండలంలోని జంబుల్‌ధరి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి రక్షణ లేకుండా ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీకాంత్, ఏఈ, విద్యుత్‌శాఖ సెల్ నంబర్ : 9603835131

ప్రకృతి మెచ్చే రంగు!



పూలతో నిండిన మోదుగు చెట్టు

- మోదుగుపూలతో రంగుల తయారీ
- అనాదిగా వస్తున్న ఆచారం
- హోలీ సంబరాలకు ఆదివాసీలు సిద్ధం

కెరమెరి: ఆదివాసీలు నిర్వహించుకునే ప్రతీ పండుగకు ప్రకృతితో విడదీయలేని బంధముంటుంది. మరో రెండు రోజుల్లో జరుపుకునే హోలీ పండుగ కూడా అదే కోవలోకి వస్తుంది. ప్రజలందరు బయట మార్కెట్లో లభించే రంగులు వాడుతుండగా ఆదివాసీలు మాత్రం మోదుగుపూలతో తయారు చేసిన రంగులను మాత్రమే పండుగ సందర్భంగా వినియోగిస్తుంటారు.

రాత్రంత నానబెట్టి

ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాల్లో ఎటు చూసినా మోదుగు చెట్లు కనిపిస్తున్నాయి. పొలాల గట్లపై, నదీతీరంలో, చెరువుల వద్ద, అడవుల్లో ఈ చెట్లు దర్శనమిస్తున్నాయి. ఆదివాసీలు హోలీ రంగుల తయారీకి మోదుగు పూలను విరివిగా వాడుతారు. పండుగకు ఒకరోజు ముందు మోదుగు పూలను తీసుకొచ్చి నీళ్లల్లో నానబెడతారు. హోలీరోజు తెల్లవారు జామున రోకలితో దంచుతారు. దంచిన పూలను నీళ్లల్లో కలిపి రంగులు తయారు చేస్తారు.

తాతల కాలం నుంచి..



మోదుగు పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకోవడం తాతముత్తాతల నుంచి ఆచారంగా వస్తుంది. ఇప్పటికీ మేం ఇదే ఆచారాన్ని అవలంభిస్తున్నాం. ఎన్ని రంగులు బయట నుంచి తీసుకొచ్చినా మోదుగుపూలతో తయారు చేసిన రంగులను తప్పక వాడుతాం. బాగా నీళ్లలో నానితే అంటుకున్న రంగు చాలాకాలం వరకు పోదు.

– కుర్సెంగ దుందేరావు, చౌపన్‌గూడ

ఏళ్లుగా వస్తున్న ఆచారం..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 21 గ్రామ పంచాయతీలు ఏజెన్సీ గ్రామ పంచాయతీలు. వీటిలోని 53 గ్రామాల్లో 11వేల జనాభా ఉంది. వీరంతా ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తుంటారు. వీరంతా ఎన్నో ఏళ్ల నుంచి ప్రకృతి ప్రసాదించిన రంగు మోదుగు పూలనే హోలీలో వాడుతారు.

అంతర్గత రహదారులకు మహర్దశ

- సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు
- ప్రారంభమైన పనులు

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ మొదలైంది. గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1కోటి 60లక్షలు మంజూరు చేసింది. దీంతో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలానికి పెద్దఎత్తున నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల వారీగా కేటాయించిన నిధులు..

పెంచికల్‌పేట్ గ్రామపంచాయితీకి రూ.15లక్షలు, ఎల్లూర్‌కు రూ.70లక్షలు, ఎల్కపల్లికి రూ. 15లక్షలు, అగర్‌గూడకు రూ.10లక్షలు, చేడ్వాయికి రూ.15లక్షలు, మురళీగూడకు రూ.5లక్షలు, కొండపల్లికి రూ.10లక్షలు, లోడుపల్లికి రూ.20లక్షల నిధుల మంజూరయ్యాయి.

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

అంతర్గత రహదారులు లేక గ్రామస్తులు వర్షాకాలంలో బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతుండడంతో బురద కష్టాలు తొలగిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు

గడువులోగా పనులు పూర్తి చేస్తాం

మండలానికి మంజూరైన సీసీరోడ్లను గడువులోగా పూర్తి చేస్తాం. మంజూరైన నిధులతో ఇప్పటికే పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈనెల 31వ తేదీ లోగా రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం.

– గంగాసింగ్, ఎంపీడీవో, పెంచికల్‌పేట్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో గల షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జెడ్పీ వైస్‌చైర్మన్‌ను శాలువా తో సన్మానించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలి

దహెగాం: హోలీ పండుగను మంగళవారం నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ప్రజలు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సనత్‌కుమార్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొదలైన సందడి..

హోలీ పండుగ వచ్చిందంటే వారం రోజుల ముందు నుంచే చిన్నాపెద్దా తేడా లేకుండా పల్లెల్లో జాజిరి ఆడుతూ సందడి చేస్తారు. ఇంటింటికీ తిరుగుతూ డబ్బులు, ధాన్యం సేకరిస్తారు. దహెగాం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు జాజిరి ఆడుతూ సందడి చేశారు.

బీబ్రా గ్రామ సందర్శన



గ్రామాన్ని సందర్శిస్తున్న బృందం సభ్యులు

దహెగాం: అభివృద్ధిలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న మండలంలోని బీబ్రా గ్రామాన్ని ఆదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ హైదరాబాద్ బృందం సభ్యులు సందర్శించారు. నీతి, నిజాయితీగా గ్రామాల అభివృద్ధి కోసం పని చేస్తున్న ఉత్తమ సర్పంచులను ఎంపిక చేసి, వారిని సత్కరిస్తున్నట్లు సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి తెలిపారు. స్థానిక సర్పంచ్ కృష్ణమూర్తిని సంస్థ సభ్యులు సత్కరించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వినూత్న కార్యక్రమాలపై డాక్యుమెంటరీ తీసి, ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మరియా అంతోని, జి. హరిప్రకాశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల పందేలు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్‌లో ఐదు రోజులపాటు కొనసాగిన ఎడ్లబండ్ల పోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలతో పాటు సమీప సరిహద్దు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో మొత్తం వంద జట్లు పాల్గొన్నాయని, మహారాష్ట్రకు చెందిన భగీరథ్‌కు చెందిన ఎడ్లు గెలుపొందడంతో రూ.5వేలు నగదు బహుమతి అందించారు. ద్వితీయ బహుమతిగా ప్రవీణ్‌కు చెందిన ఎడ్లు రూ. 5వేల నగదు గెలుచుకున్నాయి. సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, నాయకులు వానుపటేల్, కలీం పాషా, రుషి, దేవాజీ, మోరేశ్వర్, కాశీనాథ్, ఏమాజీ, గోసాయి, రగునాథ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న కమిటీ సభ్యులు

12 నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామంలో ఈ నెల 12వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సతీష్, లక్ష్మణ్, అమర్‌నాథ్ ఆదివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ. 21 వేలు, ద్వితీయ జట్టుకు రూ.11 వేలు అందిస్తామన్నారు. వివరాలకు 9392352960, 9347547828 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి



నృత్యం చేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: మహిళలు రాజకీయాల్లో రాణించాలని ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకెళ్లాలన్నారు. అనంతరం పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న శ్రీధర్

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన మోహర్లే శ్రీధర్ తన నిజాయతీ చాటుకున్నారు. తనకు దొరికిన రూ.18వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను ఆదివారం యజమానికి అప్పగించారు. జైనూర్ నుంచి కెరమెరికి శ్రీధర్ బైక్‌పై మరో వ్యక్తితో కలిసి వెళ్తున్న క్రమంలో పవర్‌గూడ గ్రామ సమీపంలో రోడ్డుపై సెల్‌ఫోన్ దొరికింది. కాగా జైనూర్ మండలం రాఘాపూర్ గ్రామానికి చెందిన కోవ రాజేందర్‌కు చెందిన సెల్‌ఫోన్‌గా నిర్ధారించుకుని ఆయనకు తిరిగి అప్పగించారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి జాతర



జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు

కెరమెరి: వారం రోజులుగా మండలంలోని నెహ్రూనగర్‌లో కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర ముగిసింది. ఆదివారం జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కిరాణాలు, హోటళ్లు, గాజులు, ఆడియో, వీడియో సీడీలు, టాటూ, ఉయ్యాలలు, బొమ్మల దుకాణాలు జనంతో కిక్కిరిసిపోయాయి. యువకులు, చిన్నారులు గుర్రపు స్వారీ చేస్తూ ఉల్లాసంగా గడిపారు. వాంకిడి, జైనూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(యూ), నార్నూర్ ప్రజలు జాతరకు తరలివచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

కౌటాల: మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ పెట్కర్ సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మెరుగైన చికిత్స కోసం కౌటాలకు చెందిన బైక్ మెకానిక్‌లు రూ.43,300 నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్‌లు బూర్ల రవి, వినోద్, డొంగ్రి రవి, బండి తిరుపతి, సుక్రత్ మండల్, సంపత్, శ్రీనివాస్, శ్రీకాంత్, మారుతి, వెంకటేశ్, ఫణిందర్, తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మెకానిక్‌లు

10న మదర్సా వార్షికోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మదర్స అరేబియా మదీనా తులుమ్ పదో వార్షికోత్సవం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ బాధ్యులు అబుల్ ఫయాజ్, అలీబిన్ అహ్మద్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని నూర్‌నగర్ ఈద్గావద్ద వార్షికోత్సవం సందర్భంగా ఖురాన్ ప్రత్యేకతపై సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, అబ్దుల్ రహమాన్, సయ్యద్ నిసార్, సాజిద్, సాలం, షబ్బీర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.